మా బావ అన్నాడు :

# 'నీ కధ బాగుందోయ్...'

వి. ఎస్. రావు

★

రైలు కూసి కదిలింది. క్రమంగా ప్లాటుఫారం కూడా దాటింది. చుట్టూచూసి పక్కనున్న కాళీబెంచీమీద కూర్చున్నా. ఆ కంపార్టుమెంటులో నేనూ, యింకో పెద్దమనిషి తప్ప ఎవరూ లేరు.

అప్రయత్నంగా పెద్దమనిషి చేతిలో వున్న పత్రికపైకి పోయింది దృష్టి.

కాశేపు నిశ్శబ్దం.

ధైర్యంచేసి 'ఒకసారి పత్రిక యిస్తారా?' అన్నాను.

'ఆ తప్పకుండా' అంటూ నా కందించి చిరునవ్వు నవ్వాడు.

ఆతృతగా పేజీలు తిరగవేశా. కళ్లు మిల మిల మెరిశాయి నన్ను నేనే నమ్మలేకపోయా. నా కధ ప్రచురింపబడింది. అంతు లేని ఆనందం పొంగిపోయింది. మొదటినుంచి తుదివరకు కధ చదివేశా. నా కధ యింత కాలాన్కి పత్రికలో పడింది గదా అని చాలా మురిసిపోయాను. ఇక నా పేరుకూడా చదువరులు చెప్పుకుంటారని నాకుకూడ ఒక నాల్గు కధలు ప్రచురింపబడేటప్పటికి పాఠకులు సన్మాన మిస్తారని ఊహా ప్రపంచములో ఆలోచిస్తూ శూన్యంగా నా యెదుట నున్న వ్యక్తి ముఖంలోకి చూశాను.

చిరునవ్వు నవ్వి "పెళ్ళిలేని కాపరం చదివారా" అన్నాడు.

సంతోషంగా 'ఆ చదివానండి అది నే....' అనబోతుంటే మాట కడ్డు వచ్చి—

చూశారా ఎంత దౌర్భాగ్యంగా ఉందో ఆంధ్రుల స్థితి, కధకి సానుభూతి చూపించి యిటువంటి తెలివితక్కువ కధలను ప్రచురించకూడదని ఎడిటర్‌కి తెలియవర్చాలి. ఏమిటి పెళ్లి లేని కాపరమేమిటి వాటి కొర్ధం. పెళ్ళి లేనిదే కాపరం ఎలా జరుగుతుంది. ఏమన్నా అర్ధము, సబబూ, సందర్భము ఉండాలికాని తాగుబోతు పేలాపన లాగ యిదేం కవిత్వము యిదేమికధ. నాకేగనక ఆ రచయిత కనబడ్డాడంటే ఏమిటి యీ అనంద ర్భపు కూతలు అని నిలదీసి అడిగేవాడ్ని' అని అంటూంటే నాకు రక్తం చల్లబడింది.

అదృష్టవంతుడ్ని ముందరే నేను వ్రాశానవి చెప్పుకోలేదు. అదీ ఒకందుకు మంచిదే. లేదంటే ఈ కదుల్తున్న రైల్లోంచి క్రిందికి తోసినా దిక్కుమొక్కూ ఉండేదికాదు. నయం నయం అని అనుకొని గుటకలు మింగుతూ.

'చిత్తం ఇప్పటి కాలములో కధలు కాస్త ఉద్రేకంగా వ్రాస్తేకాని పాఠకులు తృప్తిపడరండి' అన్నా నా కధని వెనకేసుకొస్తూ.

'నువ్వు కూడా అలాగే అంటున్నావు. రఇవత్తరంగా వ్రాయడం అంటే యిదిటయ్యా బూతులు వ్రాయడమా' అంటూ గ్రుడ్లు ఎర్రజేసి 'యిటువంటి కధలు చదువుతూవుంటే ప్రజలలో సంస్కారమేమి వస్తుంది' అంటూ గర్జించాడు.

నాకు గుండెలలో దడ బయలుదేరింది. రైలు కూతకూసి బెజవాడలో ఆగింది. ప్రాణం లేచి వచ్చింది. పత్రిక ఆయనకి వప్పగించి.

'శెలవు తీసుకుంటానని దిగుతూవుండగా మా బావమరిది' బావా! నువ్వువ్రాసిన 'పెళ్ళిలేని కాపరం' చాలా బాగుందోయ్ అన్నాడు.

నా మొహం పాలిపోయిందిన్కి, కిటికీలోంచి మీసాల వ్యక్తి కోపంగా చూశాడు.

* ఆనందవాణి